క్లుప్తంగా...

6న శ్రీకృష్ణ జయంతి వేడుకలు

రాంగోపాల్‌పేట్: రాష్ట్ర యాదవ మహాసభ ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదీన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు మహాసభ వ్యవస్థాపకులు జంగిటి బాలయ్య యాదవ్, వై కోటేశ్వరయాదవ్ ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం రాత్రి 7 గంటల నుంచి సికింద్రాబాద్ ప్యాట్నీ సెంటర్‌లోని మహబూబ్ కళాశాలలో అర్ధరాత్రి 12.30 గంటల వరకు ఈ ఉత్సవాలు నిర్వహిస్తామనర్నారు. గోపూజ, ఊరేగింపు, సాంస్కృతిక కార్యక్రమాలు, శ్రీకృష్ణ భగవానుడి పూజ, డోలాహరణం, సన్మానాలు తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు.

నేడు మాజీ వీసీ సంతాప సభ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ మాజీ వీసీ ప్రొ.నవనీతరావు సంతాప నేడు (4న) మధ్యాహ్నం 2.30 లకు జరగనుందని క్యాంపస్‌లోని ఠాగూర్ ఆడిటోరియంలో జరిగే కార్యక్రమానికి అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరుకావాలని అధికారులు కోరారు.

ఉత్తమ అధ్యాపకుడిగా ప్రొ.గణేష్



ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర విశ్వవిద్యాలయాల ఉత్తమ అధ్యాపకులుగా ఓయూ ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపల్ ప్రొ.చింత గణేష్ ఎంపికయ్యారు. సోషియాలజీ విభాగం సీనియర్ అధ్యాపకులుగా కొనసాగుతున్న ఆయన సేవలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం వర్సిటీల ఉత్తమ అధ్యాపకుడిగా ప్రకటించింది. ఆయనతో పాటు ఓయూ బీఈడీ కాలేజీ ప్రొ.మృణాళిని, టెక్నాలజీ కాలేజీ ప్రొ.హయవదన, సైన్స్ కాలేజీ ప్రొ.శ్రీనివాసులు ఉన్నారు. రేపు రవీంద్రభారతీలో జరిగే టీచర్స్ డే కార్యక్రమంలో అవార్డులు అందుకోనున్నారు.

ఘనంగా బొడ్రాయి పునః ప్రతిష్ఠ



బొడ్రాయి ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి

లాలాపేట: తార్నాక డివిజన్ లాలాపేటలో ఆదివారం బొడ్రాయి పునఃప్రతిష్ఠ ఘనంగా జరిగింది.వేద పండితుల సమక్షంలో స్థాపిత దేవతాపూజలు, బ్రహ్మశిలా సంస్కారము తదితర పూజాది కార్యక్రమాలతో బొడ్రాయిని ప్రతిష్ఠించారు. డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి, మాజీ మేయర్ బండా కార్తీకరెడ్డి కాంగ్రెస్ నేతలు నాగులూరి సాయిబాబా, నోముల ప్రకాష్‌రావు, హాజరై బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో లాలాపేట బొడ్రాయి ఉత్సవ సమితి నాయకులు, కార్యవర్గం, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బైండ్ల దశపాక నాగేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన చంద్రపటం, నవధాన్యాల రాశి, పొత్తిపోయుట, దిష్టికుంభం, అఖండజ్యోతులు, బొడ్రాయి కథా తదితర కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

వెజిటేరియన్ క్లబ్ ప్రారంభం



క్లబ్ ప్రారంభిస్తున్న ప్రతినిధులు

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ మినిస్టర్ రోడ్‌లోని ఇలాచి హోటల్‌లో ఆదివారం హైదరాబాద్ వెజిటేరియన్ క్లబ్ ప్రారంభోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రముఖ సీనియర్ సినీ నటీమణి రోజా రమణి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. వెజిటేరియన్ మూమెంట్ వ్యవస్థాపకులు ఆచార్య శ్రీనివాస్, సహ వ్యవస్థాపకులు దివ్య శ్రీనివాస్, హైదరాబాద్ క్లబ్ ప్రెసిడెంట్ విజయలక్ష్మి తదితరులు ఇలాచీ హోటల్ నుంచి 3 కి.మీ ర్యాలీని నిర్వహించి శాకాహార ప్రాముఖ్యతను వివరించారు. మానవ జీవితంలో శాకాహారం ఆరోగ్యమయ జీవితానికి ఎంతో ముఖ్యమైందని వక్తలు అభిప్రాయపడ్డారు. మాంసాహారాన్ని వదలి శాకాహారులుగా మారిన వారిని ఈ సందర్భంగా సత్కరించారు.

ఘనంగా జ్ఞాన్‌శాల దివస్



చీర సుచిత్రకు జ్ఞాపికను అందిస్తున్న దృశ్యం

రాంగోపాల్‌పేట్: డీవీకాలనీలోని తేరాపంత్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన జ్ఞాన్‌శాల దివస్‌లో నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆచార్య మహాశ్రమాన్, సాధ్వీ డాక్టర్ మంగళ్ ప్రయాగ్ హాజరై విద్యార్థులకు నైతిక విలువలు, కుటుంబ విలువలు, ఆధ్యాత్మికత, తదితర అంశాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్ పాల్గొన్నారు. నిర్వాహకులు బాబాలాల్, సుశీల్ సంచేత తదితరులు కార్పొరేటర్‌ను సత్కరించారు.

మేకలమండి పాఠశాలకు మహర్దశ

- అదనపు గదుల నిర్మాణానికి రూ. 1.84 కోట్లు మంజూరు
- నేడు మంత్రుల చేతుల మీదుగా పనులకు శంకుస్థాపన



మేకలమండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల నమూనా చిత్రం

బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ డివిజన్ భోలక్‌పూర్ క్రిష్టానగర్‌లోని మేకలమండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు మహర్దశ చేకూరనుంది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నూతన తరగతి గదుల నిర్మాణానికి రూ.1.84 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఈ నెల 4 సోమవారం రాష్ట్ర మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, సబితా ఇంద్రారెడ్డి అదనపు తరగతి గదుల పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అదే విధంగా రూ. 32.70 లక్షల వ్యయంతో నిర్మించిన మూడు నూతన తరగతి గదులను ప్రారంభిస్తారు.

750 మంది విద్యాబోధన..

భోలక్‌పూర్, క్రిష్టానగర్, బోయిగూడ, బన్సీలాల్ పేట్, కవాడిగూడ, ఐడిహెచ్ కాలనీ తదితర ప్రాంతాలకు చెందిన అనేక మంది విద్యార్థులు ఈ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్నారు. నిష్ణాతులైన ఉపాధ్యాయులు మెరుగైన విద్యాబోధనతో విద్యార్థుల జీవితాల్లో జ్ఞానజ్యోతులను వెలిగిస్తున్నారు. సుమారు 750 విద్యార్థులు ఈ పాఠశాలలో చదువుకుంటున్నారు. స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రత్యేక చొరవతో ఈ పాఠశాలలో అనేక సౌకర్యాలు, సదుపాయాలు సమకూరుతున్నాయని పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున్‌రెడ్డి చెప్పారు. విద్యా బోధనతో పాటు క్రీడాలపరంగా తీర్చిదిద్దుతున్నారు. ఇక్కడ విద్యనభ్యసించే విద్యార్థులు తెలంగాణ గురుకుల పాఠశాలలకు ఎంపిక కోసం ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నారు. పేద విద్యార్థుల జీవితాల్లో జ్ఞానజ్యోతులను వెలిగించి వారికి జీవితంలో ఉన్నత స్థితికి తీసుకురావడానికి ప్రభుత్వం విద్యాపరంగా అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ చెప్పారు.

అదనపు గదులతో...

అదనపు గదుల నిర్మాణంతో పాఠశాల రూపురేఖలు మారనున్నాయి. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో గదులు సరిపోవడం లేదు. అదనపు గదుల నిర్మాణం ద్వారా ఎంతో మేలు జరగడంతో పాటు విద్యాబోధనకు అనువుగా ఉంటుందని ఉపాధ్యాయులు అంటున్నారు. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రత్యేకంగా చొరవ తీసుకొని అదనపు గదుల నిర్మాణానికి ఉన్నతాధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి మంజూరు చేయించడం పట్ల ఉన్నత పాఠశాల సాధన సమితి ప్రతినిధులు ఇ. చంద్రశేఖర్, బి. నర్సింగ్‌రావు, వి. శేషగిరిరావు, రాజు కృతజ్ఞతలు తెలిపారు.

- మేకలమండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల అదనపు గదుల నిర్మాణం, నూతన తరగతి గదుల ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధం చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున్‌రెడ్డి, జి. పవన్‌కుమార్ గౌడ్ చెప్పారు. ఉదయం 10.30 లకు రాష్ట్ర మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్‌లు కలిసి భూమి పూజ చేయడంతో పాటు నూతన అదనపు గదులను ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

‘భూకబ్జాదారులకు ఓయూ అధికారుల సహకారం’



ఓయూలో దిష్టిబొమ్మ దహనం చేస్తున్న దృశ్యం

ఉస్మానియా యూనివర్సిటీ: యూనివర్సిటీ భూముల కబ్జాదారులకు ఓయూ అధికారులు సహకరిస్తున్నారని వామపక్ష విద్యార్థి నేతలు ఆరోపించారు. ఆదివారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట భూ కబ్జాదారులు, ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. హబ్సిగూడ, మాణికేశ్వర్‌నగర్ భూములను పరిరక్షించాలని డిమాండ్ చేశారు. తప్పుడు పత్రాలను సృష్టించి ఓయూ భూముల కబ్జాకు ఉపక్రమిస్తున్నారని రాజకీయ లబ్ధికోసం వర్సిటీల భూముల కబ్జాను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. నాటి వీసీలు ఓయూ భూములను కాపాడితే నేటి అధికారులు కబ్జాదారులకు సహకరించడం సిగ్గుచేటన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న రామకృష్ణ

రసూల్‌పురా: కంటోన్మెంట్ ప్రాంత అభివృద్ధిలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుండగా కేంద్ర ప్రభుత్వం నుంచి బోర్డుకు వస్తున్న నిధులతో బీజేపీ ఆధ్వర్యంలో అభివృద్ధి జరుగుతోందని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యులు జే. రామకృష్ణ అన్నారు ఆదివారం రెండవ వార్డు రసూల్‌పురా ఉద్భవ్ స్కూల్ సమీపంలో నూతనంగా సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. గతంలో తాను బస్తీబాట నిర్వహించగా స్థానికులు రోడ్ల సమస్యను తన దృష్టికి తీసుకువచ్చారని వారికి ఇచ్చిన హామీ మేరకు పనులను ప్రారంభించామన్నారు. సమస్యకు పరిష్కారం కోసం చొరవ చూపడంతో రామకృష్ణకు స్థానికులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా అధ్యక్షుడు జగన్, శ్రీహరి, సుదర్శన్, సత్యనారాయణ, కిషోర్, నవీన్, బాబు, శ్రీరాములు మహేష్ సమీర్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరికలు




పార్టీలోకి చేరిన వారికి కండువా కప్పుతున్న పద్మారావుగౌడ్

సికింద్రాబాద్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నుంచి బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ పేర్కొన్నారు.వారాసిగూడకు చెందిన యువకులు ఆదివారం బీఆర్‌ఎస్‌లో చేరగా వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో రాజకీయాలకతీతంగా అర్హులను గుర్తించి సంక్షేమ పథకాలను అందజేస్తున్నామన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలోని ఓ వైపు అభివృద్ధి పనులు, మరోవైపు సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందించడంలో ముందున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యువజన నాయకుడు తీగుళ్ల రామేశ్వర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యమైందా.. నాలాలో పడిందా?

మహిళ అదృశ్యంపై అధికారుల ఆరా



లక్ష్మి

బన్సీలాల్‌పేట్: ఓ మహిళ అదృశ్యం కాగా హుస్సేన్ సాగర్‌లో పడిందనే అనుమానాలు వ్యక్తమవుతున్న ఘటన గాంధీనగర్ పోలీస్ స్టేషన్‌పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సైక్టర్ రవి వివరాల ప్రకారం.. కవాడిగూడ దామోదర్ సంజీవయ్య నగర్ బస్తీకి చెందిన లక్ష్మీ (55) హుస్సేన్‌సాగర్ నాలా పక్కనే ఉన్న బస్తీలో నివాసముంటుంది. ఆదివారం మధ్యాహ్నం స్టవ్‌పై బియ్యం పెట్టి వెళ్లిన లక్ష్మీ సాయంత్రం వరకు ఇంటికి రాలేదు. పెద్ద కూతురు సునీత వచ్చి చూసే సరికి ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయి. ఆమె కోసం ఎంత వెతికినా ఫలితం లేక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు లక్ష్మీ ఇంటి గోడ కూలిపోయింది. అయితే నాలా ప్రహరీ నిర్మించిన తర్వాత గోడతో పాటు బాత్‌రూమ్ నిర్మించుకోవాలని లక్ష్మీ నిర్ణయించుకుంది. అయితే హుస్సేన్‌సాగర్ నాలా ప్రహరీ నిర్మాణం చేయకుండా అలాగే వదిలేశారు. అయితే లక్ష్మీ ఇంట్లో నుంచి నాలా వైపు వెళ్లి అందులో ప్రమాదవశాత్తు పడిపోయిందానే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్ రచనశ్రీ, ముఠా జైసింహ, వెంకటేష్, శ్రీనివాస్‌రావు, మహేందర్ బాబు తదితరులు ఘటనా స్థలానికి చేరుకుని ఆరా తీశారు.

కొండా లక్ష్మణ్ బాపూజీకి ‘భారతరత్న’ ఇవ్వాలి

కాచిగూడ: ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీకి ‘భారతరత్న’ ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు గుజ్జ సత్యం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ‘పద్మశాలీ శంఖారావం’ సభకు గుజ్జ సత్యం ఆధ్వర్యంలో నారాయణగూడ నుంచి చేనేత కార్మికులు, పద్మశాలీలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ఆయన మాట్లాడుతూ.. పద్మశాలీలను గుర్తించి సీట్లు ఇచ్చే పార్టీలకే ఓట్లు వేయాలన్నారు. పద్మశాలీలను నిర్లక్ష్యం చేసే పార్టీలకు గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. రాజకీయంగా పద్మశాలీలు రాణించాలన్నారు. జనాభా ప్రాతిపదికన పద్మశాలీలకు అన్ని రంగాల్లో వాటా దక్కాలని, వాటా కోసం పద్మశాలీలు ఐక్యంగా ఉద్యమించాలన్నారు.

ఎస్సీ కార్పొరేషన్‌ను మూడుగా విభజించాలి



వెంకట్‌మాల

ఉస్మానియా యూనివర్సిటీ: ఎస్సీ కార్పొరేషన్‌ను మూడుగా విభజించాలని తెలంగాణ మాల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు చినేని వెంకట్ మాల కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాల కార్పొరేషన్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తేనే రాబోవు ఎన్నికల్లో బీఆర్‌ఎస్ మాలల మద్దతు ఉంటుందని లేని పక్షంలో ఎస్సీల నడుమ రిజర్వేషన్ల చిచ్చుపెట్టి విడదీసిన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుకు పట్టిన గతే సీఎం కేసీఆర్‌కు పడుతుందన్నారు. కాంగ్రెస్ ఎస్సీ డిక్లరేషన్‌తో ఎలాంటి ఉపయోగం లేదన్నారు. ప్రస్తుతం ఎస్సీ కార్పొరేషన్‌లో 2014 నుంచి 2023 వరకు వివిధ పథకాలకు ప్రభుత్వం విడుదల చేసిన కోట్లాది రూపాయల నిధులు 85 శాతం మాదిగలు కేటాయించగా మాలలకు కేవలం 15 శాతం నిధు లు మాత్రమే ఇచ్చారని ఎస్సీలలోని అన్ని కులాలకు అభివృద్ధి చెందాలంటే ఆంధ్రప్రదేశ్ మాదిరి మాల, మాదిగ, ఉపకులాలకు వేర్వేరుగా కార్పొరేషన్లు ఏర్పాటు చేసి మాలల అభివృద్ధికి రూ.2 వేల కోట్లను కేటాయించాలని డిమాండ్ చేశారు.

లైఫ్ స్టైల్ నుంచి ఆటమ్ వింటర్ కలెక్షన్

సాక్షి, సిటీబ్యూరో: వాతావరణ మార్పులకు అనుగుణంగా దుస్తుల కలెక్షన్‌ను రూపొందించే ప్రముఖ ఫ్యాషన్ బ్రాండ్ లైఫ్ స్టైల్ తాజాగా ఆటమ్ వింటర్ కలెక్షన్‌ను నగరంలో విడుదల చేసినట్లు ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు. రైస్-నిట్ ఫ్రెంచ్ టెర్రీ ఫ్యాబ్రిక్‌ను ఉపయోగించి తయారైన కాటన్ గ్రాఫిక్ టీషర్ట్‌లు, ట్రాక్ ప్యాంట్‌లు, స్వెట్‌షర్ట్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు.

దుకాణానికి వెళ్లిన యువతి అదృశ్యం

బౌద్ధనగర్: దుకాణానికి వెళ్లిన ఓ యువతి అదృశ్యమైన ఘటన వారాసిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. ఒరిస్సాకు చెందిన భాను కుటుంబం గతేడాది నగరానికి వచ్చి పార్శీగుట్ట న్యూ అశోక్‌నగర్‌లో ఉంటున్నారు. వారితో పాటు ఆమె సోదరి మోహిని (24) కూడా ఉంటుంది. గత నెల 28వ తేదీన ఇంటి పక్కన ఉండే ఓ మహిళతో గొడవ జరిగింది. తన భర్తతో అక్రమ సంబంధం పెట్టుకున్నావని సదరు మహిళ మోహినిని కొట్టింది. దీంతో ఆమె నాటి నుంచి మనోవేదనకు గురవుతూ వచ్చింది. గత నెల 31వ తేదీన దుకాణం వెళ్లివస్తానని ఎంతకీ రాలేదు. బంధువులు, తెలిసిన వారితో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో సోదరి భాను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

వ్యభిచార గృహంపై దాడి

- పలువురి అరెస్టు

అమీర్‌పేట: వ్యభిచారం నిర్వహిస్తున్న వ్యక్తి సహా ముగ్గురిని అరెస్టు చేసిన ఘటన ఎస్‌ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రాంప్రసాద్‌రావు వివరాల ప్రకారం.. దాసారం బస్తీ ఎల్‌ఐజీహెచ్ ఇంటి నెంబర్ 272/సీలో వ్యభిచారం నిర్వహిస్తున్నారన్న సమాచారంతో పోలీసులు దాడి చేశారు. లొకాంటో యాప్ ద్వారా విటులను ఆకర్షించి వ్యభిచార కార్యకలాపాలు నడుపుతున్నట్లు గుర్తించారు. సమయంలో అక్కడే ఉన్న నిర్వాహకుడు బొండా బాబుతో పాటు ఓ యువతి, మరో విటుడిని అరెస్టు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ఫుట్‌పాత్‌పై పశువుల పెంపకం

- పట్టించుకోని అధికారులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బాగ్‌లింగంపల్లిలోని వాటర్‌వర్క్స్ కార్యాలయం సమీపంలోని హౌజింగ్ బోర్డు కాలనీకి చెందిన ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకుని ఓ వ్యక్తి పశువులను కట్టేసి పెంచుతుండటంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఆవుల పేడ, మూత్రంతో పాటు కుళ్లిపోయిన టమాటాలు, పశువుల దానా ఉండటంతో దుర్గంధం వెదజల్లుతుందని ప్రజలు వాపోతున్నారు. ఓ స్థానికుడిపై సదరు వ్యక్తి కత్తితో పొడిచేస్తానని బెదిరించినట్లు సమాచారం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యాదానం జీవితాంతం సంతృప్తినిస్తోంది



ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ గుర్తింపు పత్రాన్ని అందుకుంటున్న వెల్లాల రామ్మోహన్

సనత్‌నగర్: విద్యాదానం జీవితాంతం సంతృప్తినిస్తోందని త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామి అన్నారు. బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య రాష్ట్రఅ ధ్యక్షులు వెల్లాల రామ్మోహన్ అధ్యక్షతన ఆదివారం సనత్‌నగర్‌లోని హనుమాన్ దేవస్థానం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 110 మంది పేద బ్రాహ్మణ విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, 80 మందికి రూ.10 లక్షల విలువైన స్కాలర్‌షిప్‌లను అందజేశారు.ఈ కార్యక్రమానికి హాజరైన స్వామిజీ మాట్లాడుతూ.. భగవంతుడు మనకిచ్చిన దానిలో ఎంతో కొంత సమాజహితానికి వినియోగించాలన్నారు. ఎమ్మెల్సీ వాణీదేవి మాట్లాడుతూ.. చదువుకు మించిన ఆయుధం లేదని తన తండ్రి మాజీ ప్రధాన మంత్రి పీవీ నరసింహారావు ఎప్పుడూ చెబుతుండే వారన్నారు. వెల్లాల రామ్మోహన్ తన సొంత ఖర్చుతో ల్యాప్‌టాప్‌లతో పాటు స్కాలర్‌షిప్‌లు అందజేయడం అభినందనీయమన్నారు. బ్రాహ్మణులు తమ కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు వీలుగా ఒక వేదిక కావాలని సమాఖ్య ప్రతినిధులు కోరగా, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. బీఎస్‌ఎస్‌ఎస్ చేస్తున్న సేవా కార్యక్రమాలకు తనవంతుగా రూ.25 వేలు ఆర్థిక సహాయం అందిస్తానని ప్రకటించారు. నీటి పారుదల కార్పొరేషన్ చైర్మన్ సముద్రాల వేణుగోపాలాచారి మాట్లాడుతూ.. విద్యార్థులకు అందివచ్చిన ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలపడాలన్నారు. రామ్మోహన్ మాట్లాడుతూ.. సమాఖ్య తరుపున భవిష్యత్‌లో విభిన్న కార్యక్రమాలను చేపడుతూ బ్రాహ్మణులకు చేయూతనందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు, డాక్టర్ వరప్రసాద్, కార్పొరేటర్ శ్రవణ్, మాజీ కార్పొరేటర్ శేషుకుమారి, దేవాదాయ శాఖ అర్చక, ఉద్యోగ జేఏసీ కన్వీనర్ పరాశరం రవీంద్రాచార్యులు, బీఎస్‌ఎస్‌ఎస్ ప్రతినిధులు ఎంవీ శాస్త్రి, రెండుచింతల రామచంద్రమూర్తి, గొంగులూరి విజయలక్ష్మి, పంచగంగేశ్వర్, పులిపాక రవీంద్ర, సోమయాజులు, ఉపేంద్రకుమార్ పాల్గొన్నారు.

- మొట్టమొదటిసారిగా ఒకేసారి 110 మంది విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేయడంతో ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో బీఎస్‌ఎస్‌ఎస్‌కు స్థానం దక్కింది. ఈ మేరకు వేదికపై ధ్రువీకరణ పత్రాన్ని వెల్లాల రామ్మోహన్‌కు అందజేశారు.

ఎల్లమ్మ ఆలయ ఈఓకు సన్మానం

అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ దేవాలయం కార్యనిర్వాహణ అధికారిగా బాధ్యతలు తీసుకున్న కుంట నాగరాజును రాష్ట్ర వీరశైవ సేవా సమాజ ప్రతినిధులు సన్మానించారు.బల్కంపేటకు చెందిన నాగ రాజు భవిష్యత్‌లో మరిన్ని పదవులు పొందాలని ఆకాంక్షించారు. అదే విధంగా బల్కంపేట రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం కమిటీ సభ్యులను సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శేకరప్ప, సెట్టి ప్రనేష్,గడ్డల చంద్రశేఖర్,గాజుల శ్రీశైలం,సంతోష్ పాల్గొన్నారు.



ఆలయ ఈఓ నాగరాజును సన్మానించిన వీరశైవ సేవా సమాజం ప్రతినిధులు

హైజంప్‌లో దివ్యకు గోల్డ్ మెడల్



గోల్డ్‌మెడల్ సాధించిన దివ్య

రసూల్‌పురా: హైదరాబాద్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 67వ అంతర్‌జిల్లా ఇంటర్ స్కూల్ క్రీడా పోటీల్లో హైజంప్‌లో తిరుమలగిరి హోలి ఫ్యామిలీ హైస్కూల్ 8వ తరగతి విద్యార్థి దివ్య సత్తా చాటింది. నగరంలోని ఏవీ కళాశాల మైదానం దోమల్‌గూడలో ఆదివారం జరిగిన హైజంప్ పోటీల్లో 115 సెం.మీ. హైజంప్ చేసిన దివ్య బంగారు పతకం సాధించింది. ప్రతిభ కనబర్చిన దివ్యకు ప్రిన్సిపల్, విద్యార్థులు, కోచ్ పీఈటీ అభినందించారు.

నిత్యాన్నదానం ప్రారంభం



నిత్యన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సంఘం నాయకులు

లాలాపేట: తార్నాక కమ్మ సేవా సంఘం ఆధ్వర్యంలో పేదలకు నిత్యాన్నదాన కార్యక్రమం ఆదివారం ప్రారంభమైంది. మాజీ మేయర్ బండా కార్తీకరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కమ్మ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. తార్నాకలోని పుష్పక్ బస్టాప్ వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమం శిబిరం వద్ద ప్రతి రోజు మధ్యాహ్నం అన్నదానంతో పాటు మజ్జిగ పంపిణీ ఉంటుందని సంఘం నాయకులు పేర్కొన్నారు. దీంతో పాటు వృద్ధాశ్రమాల్లో పండ్ల పంపిణీ, పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందజేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో నాగమల్లేశ్వరి, సీతారామయ్య, చిట్టి వీరయ్య, సుబ్బారావు, రాధాకృష్ణ, సుశీల, సుధా రాణి, వీరమాచినేని రమేష్ బాబు పాల్గొన్నారు.

ఓటర్లుండే ప్రాంతంలోనే బూత్‌లు కేటాయించాలి



ఓటరు జాబితాను పరిశీలిస్తున్న మర్రి శశిధర్‌రెడ్డి



లాలాపేటలో..

సనత్‌నగర్: సుదూరంలో కాకుండా ఓటర్లు తాము ఉండే ప్రాంతంలోనే ఓటు వేసేలా పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేయాలని బీజేపీ నేత మర్రి శశిధర్‌రెడ్డి కోరారు. సనత్‌నగర్ నియోజకవర్గం బేగంపేట డివిజన్‌లోని భగవంతాపూర్‌లోని పోలింగ్ కేంద్ర 37, 38ను ఆదివారం ఆయన సందర్శించి అక్కడ అందుబాటులో ఉంచిన ఓటరు జాబితాలను పరిశీలించారు. ఒకే కుటుంబంలో ఉంటున్న ఓటర్లను వేర్వేరు పోలింగ్ బూత్‌లలో కాకుండా ఒకే బూత్‌లో ఉండేలా చూడాలన్నారు. ఆయన వెంట మిథున్‌జైన్, షేక్‌గౌస్ ఉన్నారు.

ఒకే బూత్‌లో ఓటుహక్కు కల్పించాలి..

మోడల్‌కాలనీలో ఓటర్లకు మూడు పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేయడంతో అసౌకర్యంగా ఉందని ఆసరా కమిటీ ఖైరతాబాద్ సర్కిల్ ఉపాధ్యక్షుడు జేఏస్టీ శాయి అధికారులకు వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా సుదూరంలో ఉన్న ఎస్‌ఆర్‌నగర్ వాటర్ వర్క్స్ కార్యాలయం, సెయింట్ థెరిస్సా స్కూల్‌లోని పోలింగ్ బూత్‌లకు వెళ్లి ఓటేయాలంటే ఇబ్బందికరంగా ఉంటుందన్నారు. సమీపంలోని సుందర్‌నగర్ కమ్యూనిటీ హాల్ పోలింగ్ బూత్ లేదా మోడల్‌కాలనీ కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేయాలన్నారు.

తార్నాక, లాలాపేట, శాంతినగర్‌లో..

లాలాపేట: తార్నాక, లాలాపేట, శాంతినగర్ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లను బీజేపీ మహకాళి జిల్లా ఓబీసీ ప్రధాన కార్యదర్శి సుక్క గణేష్ ముదిరాజ్ సందర్శించారు. అర్హులు తప్పకుండా ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో భిక్షపతి యాదవ్, జమ్మికుంట వేణు, రామకృష్ణ నాయకులు పాల్గొన్నారు.

‘హెచ్‌పీఎస్’లో ముగిసిన అధ్యాపకుల సదస్సు



విద్యావంతుల సదస్సులో పాల్గొన్న వక్తలు

చివరిరోజు ఎన్‌ఈపీ, క్రీడల ఆవశ్యకతపై చర్చలు

సనత్‌నగర్: బేగంపేటలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ (హెచ్‌పీఎస్)లో మూడు రోజుల పాటు జరిగిన విద్యావేత్తల సదస్సు ఆదివారం ముగిసింది. మూడో రోజు ప్రధానంగా నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ (ఎన్‌ఈపీ) అమలు, క్రీడల ఆవశ్యకతపై కొనసాగింది. ఈ సందర్భంగా జరిగిన ప్రత్యేక సెషన్స్‌లో నిపుణులైన అధ్యాపకులు పరస్పరం ఆలోచనాలను పంచుకున్నారు. ముఖ్యంగా జాతీయ విద్యా విధానంపై ఉపాధ్యాయుల పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండడంతో పాటు ఆ దిశగా విద్యార్థులకు మార్గనిర్దేశం చేయాలన్నారు. అలాగే విద్యార్థులను కేవలం చదువుకే పరిమితం చేయకుండా క్రీడల్లోనూ ప్రోత్సహించడం ద్వారా మానసికంగా దృఢత్వాన్ని సాధిస్తారని వక్తలు పేర్కొన్నారు. క్రీడలు ద్వారానే ఆరోగ్యకరమైన వాతావరణం పెంపొందుతుందన్నారు. కేవలం క్రీడా పోటీలను పాఠశాల స్థాయికే పరిమితం చేయకుండా జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదిగేలా వారికి తర్ఫీదు ఇవ్వాలన్నారు. కాగా నాజర్ స్కూల్ డైరెక్టర్, హెచ్‌పీఎస్ పూర్వ విద్యార్థి మీర్ మహ్మద్, స్పోర్ట్స్ ఫర్ ఆల్ డైరెక్టర్ రిషికేష్ జోషి, హైదరాబాద్ రన్నర్స్ సొసైటీ ఫౌండర్ రాజేష్ వెత్సా, ఖేలో మోర్ ఫౌండర్ జతిన్ పరంజీపే హాజరై ఆయా అంశాలపై సుదీర్ఘంగా చర్చించి తమ ఆలోచనలను ఆవిష్కరించారు. హెచ్‌పీఎస్ సొసైటీ అధ్యక్షుడు గుస్తీ జే నోరియా, ప్రిన్సిపాల్ స్కంద్‌బాలి, వైస్ ప్రిన్సిపాల్ అమృత చంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.